RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in

సంపుటి -13 సంచిక - 403 | 16 మంగళవారం జూన్ 2026 | ఎడిటర్: బట్టు లక్ష్మీ నారాయణ | పేజీలు - 6 వెల రూ 5 /--



హైదరాబాద్ స్ఫూర్తికి సాలార్‌జంగ్

## మ్యూజియం ప్రతీక

### : డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్ నగర స్ఫూర్తికి, సాంస్కృతిక సామరస్యానికి సాలార్‌జంగ్ మ్యూజియం నిలువెత్తు నిదర్శనమని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. మ్యూజియం 75వ వార్షికోత్సవం, సాలార్‌జంగ్-III, 137వ జయంతిని పురస్కరించుకుని ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. విభిన్న సంస్కృతులు, విశ్వాసాలకు నిలయంగా ఉన్న ఈ మ్యూజియం అభివృద్ధికి ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు.ఈ వేడుకల్లో పాల్గొన్న గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ.. సాలార్‌జంగ్ మ్యూజియం వివిధ సంస్కృతుల మధ్య సామరస్యానికి ప్రతీక అని, ఇది ఒక అపురూపమైన జాతీయ సంపద అని అభివర్ణించారు. జూన్ 14 నుంచి 21 వరకు వారం రోజుల పాటు నిర్వహించే ప్లాటినం జూబ్లీ వేడుకల ద్వారా మ్యూజియం విశిష్టతను ప్రపంచవ్యాప్తంగా మరింత చాటిచెప్పేలా చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు.

సాలార్‌జంగ్-×××గా ప్రసిద్ధి చెందిన మీర్ యూసుఫ్ అలీ ఖాన్ ఒక్కరే సేకరించిన అరుదైన కళాఖండాలతో ఈ మ్యూజియం ఏర్పాటైంది. 1951లో మూసీ నది ఒడ్డున ప్రారంభమైన ఈ మ్యూజియం, నేడు దేశంలోని అతిపెద్ద మ్యూజియంలలో ఒకటిగా గుర్తింపు పొందింది. భారత ప్రభుత్వం దీనిని జాతీయ ప్రాముఖ్యత కలిగిన సంస్థగా గుర్తించింది. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు, ప్రముఖులు పాల్గొన్నారు.

మెట్రో విస్తరణను కిషన్‌రెడ్డే

## అడ్డుకుంటున్నారు

### : సీఎం రేవంత్ రెడ్డి

- కిషన్‌రెడ్డి, అశ్వినీ వైష్ణవ్‌పై రేవంత్ విమర్శలు
- ఐఆర్‌ఎఫ్‌సీ రుణం నిలిపేశారన్న వాదన
- ఎన్‌ఓసీ ఇస్తే చాలన్న సీఎం
- బీజేపీ, బీఆర్‌ఎస్‌పై ఘాటు వ్యాఖ్యలు
- హైదరాబాద్‌పై కేంద్రం వివక్ష చూపుతోందని ఆరోపణ



హైదరాబాద్ విస్తరణను అడ్డుకుంటుందని కేందమంత్రి జి. కిషన్ రెడ్డేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. మెట్రో టేకోవర్ కావాల్సిన ఐఆర్‌ఎఫ్‌సీ రుణం కోసం రాష్ట్ర ప్రభుత్వం తరఫున అంతా సిద్ధం చేసుకున్నట్లు వెల్లడించారు. కానీ, కిషన్‌రెడ్డి తన సహచర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో కలిసి కుట్ర పన్నారని ఆరోపించారు. రుణం మంజూర్ కాకుండా అడ్డుకున్నారని పేర్కొన్నారు. జపాన్ నుంచి నిధులు కూడా వచ్చాయని రేవంత్ తెలిపారు. కానీ, వాటిని రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం ఇవ్వడం లేదని ఆరోపించారు. రాజకీయంగా నష్టం జరుగుతుందనే కుట్ర పన్నుతున్నారని తెలిపారు. బీఆర్ఎస్, బీజేపీ కలిసే మెంట్రో విస్తరణను అడ్డుకుంటున్నారని తెలిపారు. ఈ విషయాలపై కేంద్రాన్ని అడిగితే.. కింద సమస్యలు ఉన్నాయని తెలిపినట్లు వెల్లడించారు. మెట్రో విస్తరణకు రూ.40 వేల కోట్లు కావాలని, అంతా మేమే భరిస్తాం, కేవలం ఎన్‌ఓసీ ఇవ్వండి కేంద్రం భాగస్వామ్యం లేకుండా నిర్మిస్తామన్నాం. సమస్యలపై చర్చిద్దామంటే కిషన్‌రెడ్డి సమయం ఇవ్వట్లేదని రేవంత్ అన్నారు. ఆయనపై ఎలాంటి కోపం లేదని తెలిపారు. కేవలం ఆయన నుంచి సహకారం మాత్రమే కోరుకుంటున్నానన్నారు. అహ్మదాబాద్ మెట్రోకు అనుమతి, నిధులు ఇచ్చారని, విశాఖ మెట్రో నిర్మాణానికి కూడా అనుమతులు ఇచ్చారని గుర్తు చేశారు. కానీ, హైదరాబాద్ మెట్రోకు నిధులతో పాటు అనుమతులూ లేవని విమర్శించారు. అక్కడే వివక్ష ఉన్నట్లు స్పష్టంగా అర్థమవుతోందని ఆరోపించారు.కేసీఆర్‌కు కిషన్ రెడ్డి లొంగిపోయారని రేవంత్ ఆరోపించారు. ఆయనకు అంత తెలివిలేదంటూ ఘాటు విమర్శలు చేశారు. కేటీఆర్ చెప్పినట్లు నడుచుకుంటున్నారని పేర్కొన్నారు. ఆయన డైరెక్షన్‌లోనే కిషన్‌రెడ్డి వెళ్తున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వం మెట్రో నిర్మాణాన్ని ప్రజల అవసరాలకు అనుగుణంగా నిర్మించలేదన్నారు. ఇప్పుడు దాన్ని సరిచేసుకుంటామంటే వివిధ రకాలుగా అడ్డు తగులుతున్నారని ఆరోపించారు.

## మీనాక్షి నటరాజన్‌కు వెన్నుపోటు పొడిచింది రేవంత్ రెడ్డే: కేటీఆర్



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. సొంత పార్టీ నేత, రాహుల్ గాంధీకి సన్నిహితురాలైన మీనాక్షి నటరాజన్‌కు రేవంత్ రెడ్డి వెన్నుపోటు పొడిచారని, ఆమెపై తప్పుడు కేసు బనాయించి వేధించారని విమర్శించారు. ఆమెకు మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభ సీటు రాకుండా అడ్డుకునేందుకు బీజేపీతో కుమ్మక్కయ్యారని ఆరోపించారు.ఆదివారం ఖైరతాబాద్ నియోజకవర్గ పార్టీ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. రేవంత్ రెడ్డి అవినీతి, భూ ఒప్పందాలపై మీనాక్షి నటరాజన్ కాంగ్రెస్ అధిష్ఠానానికి ఫిర్యాదు చేశారని, దీనికి ప్రతీకారంగానే హైదరాబాద్‌లో ఆమెపై తప్పుడు కేసు పెట్టించారని అన్నారు. సొంత పార్టీ నేతలనే వెన్నుపోటు పొడిచే నైజం రేవంత్ రెడ్డిదని ఆయన దుయ్యబట్టారు. హిట్లర్ తన ఆదర్శం అని సీఎం చెప్పడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు.

కాంగ్రెస్ పాలనను 'అట్టర్ ఫ్లాప్ సినిమా'గా అభివర్ణించిన కేటీఆర్, ప్రభుత్వం హామీల అమలులో పూర్తిగా విఫలమైందని అన్నారు. ఏడాదికి 2 లక్షల ఉద్యోగాల హామీ ఏమైందని, కనీసం 4,000 ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదని ప్రశ్నించారు. రూ.4,000 నిరుద్యోగ భృతి హామీని కూడా విస్మరించారని మండిపడ్డారు. కోటి మంది మహిళలను లక్షాధికారులను చేశామని నిరూపిస్తే తాను రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు.ఖైరతాబాద్‌లో ఉపఎన్నిక రావడం ఖాయమని కేటీఆర్ జోస్యం చెప్పారు. ప్రజాతీర్పును ధిక్కరించి దానం నాగేందర్ కాంగ్రెస్‌లోకి ఫిరాయించడమే దీనికి కారణమని స్పష్టం చేశారు. జూన్ 25 నుంచి జరిగే ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొనాలని, డిజిటల్ సభ్యత్వ నమోదును రికార్డు స్థాయిలో చేపట్టాలని పార్టీ శ్రేణులకు ఆయన దిశానిర్దేశం చేశారు.

## దేశ ఆర్థిక వ్యవస్థ బాగానే ఉంది.. కానీ..

### : మంత్రి నిర్మలా సీతారామన్



భారత ఆర్థిక వ్యవస్థ పనితీరు సంతృప్తికరంగానే ఉందని, అయితే ఈ వృద్ధిని తేలిగ్గా తీసుకోవద్దని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. దీర్ఘకాలికంగా వృద్ధిని కొనసాగించాలంటే నిరంతర ఆవిష్కరణలు, సంస్కరణలు, వ్యవస్థల బలోపేతం చాలా అవసరమని ఆమె స్పష్టం చేశారు. ఇవాళ జరిగిన 'మైండ్‌మైన్ సమ్మిట్ 2026'లో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ.. "మన దేశం ఆర్థికంగా బాగానే రాణిస్తోందని నాకు తెలుసు. కానీ, మన పనితీరును మనం నిరంతరం జాగ్రత్తగా విశ్లేషించుకోవాలి. ఇంకా ఎక్కడ మెరుగుపరుచుకోవాలో గుర్తించాలి" అని అన్నారు. కేవలం ఆర్థిక వృద్ధి మాత్రమే సరిపోదని, స్థిరమైన, సమ్మిళిత అభివృద్ధి కోసం బలమైన సంస్థలు, సమర్థవంతమైన విధానాలు, పటిష్ఠమైన మద్దతు వ్యవస్థలు ఉండాలని ఆమె అభిప్రాయపడ్డారు.భారత్ వంటి పెద్ద, సంక్లిష్ట ఆర్థిక వ్యవస్థలో వృద్ధిని నిలబెట్టుకోవాలంటే సామర్థ్యాలను బలోపేతం చేయడం, సామర్థ్యాన్ని మెరుగుపరచడం, అభివృద్ధి ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు చేరేలా చూడటం కోసం నిరంతరం కృషి చేయాలని ఆమె సూచించారు. "పురోగతి దానంతట అదే వస్తుందని భావించకూడదు. వృద్ధి వేగాన్ని కొనసాగించడానికి నిరంతర కృషి, ఆవిష్కరణలు, సంస్కరణలు తప్పనిసరి" అని ఆమె పేర్కొన్నారు. అనేక రంగాలు బలంగా రాణిస్తున్నప్పటికీ, ముఖ్యంగా సంక్లిష్టమైన, మధ్యంతర ఉత్పత్తులు, సేవలకు సంబంధించిన కొన్ని రంగాలకు విధానపరమైన మద్దతు ఇంకా అవసరమని ఆమె అంగీకరించారు. దీర్ఘకాలంగా ఉన్న సవాళ్లను నిర్మాణాత్మక సంస్కరణలు, మెరుగైన అమలు లేదా కొత్త విధానాల ద్వారా ఎలా పరిష్కరించవచ్చో విధానకర్తలు నిరంతరం పరిశీలించాలని అన్నారు.

ఎల్ నినోపై హెచ్చరిక: ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంపై కేంద్ర మంత్రి కీలక హెచ్చరిక చేశారు. దీని కారణంగా రుతుపవనాలు బలహీనంగా ఉండే అవకాశం ఉందని, ప్రభుత్వం అందుకు సిద్ధమవుతోందని తెలిపారు. "కొన్ని ప్రాంతాలు పొడిగా ఉండొచ్చు, మరికొన్ని చోట్ల అధిక వర్షాలు కురవొచ్చు. ఇది ఏడాది పొడవునా ఆందోళన కలిగించే అంశం. అయితే, ఈసారి ఎల్ నినో కారణంగా బలహీనమైన రుతుపవనాలకు మేం సిద్ధమవుతున్నాం" అని నిర్మల వివరించారు. కోవిడ్-19 మహమ్మారి అనంతర ప్రభావాలు ఇంకా ప్రణాళికలను ప్రభావితం చేస్తున్నప్పటికీ, పెద్ద అంతరాయాలు ఏవీ ఊహించడం లేదని ఆమె తెలిపారు. భవిష్యత్ సవాళ్లను ఎదుర్కొనేందుకు, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విధానాలను మార్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆమె స్పష్టం చేశారు.

## అధికారులపై సీఎం రేవంత్ ఫైర్..


### అవసరమైతే నేనూ రోడ్లపైకి వస్తా!



రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు, ప్రకృతి విపత్తుల నేపథ్యంలో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. అధికారులు ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని, వివిధ శాఖల మధ్య సమన్వయాన్ని పెంపొందించుకోవాలని ఆయన ఆదేశించారు.జూన్ 1న నిర్వహించిన సమీక్షలో ముందస్తు సూచనలు జారీ చేసినప్పటికీ, జూన్ 9న కురిసిన వర్షం సమయంలో అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహించారని, శాఖల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపించిందని ముఖ్యమంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. వర్షాలు కురిసే సమయంలో జీహెచ్‌ఎంసీ, పోలీస్, ట్రాఫిక్, విద్యుత్ శాఖల ఉన్నతాధికారుల నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు ప్రతి ఒక్కరూ రోడ్లపైనే ఉండి విధులను పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. "అవసరమైతే నేనూ స్వయంగా క్షేత్రస్థాయిలోకి వస్తాను. ట్రాఫిక్ సమస్యలు లేదా వరదల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని" ఆయన హెచ్చరించారు.ట్రాఫిక్ విభాగంలో ఉన్న ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని అధికారులను ఆదేశించారు. రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో, ఈ సమీక్షా సమావేశం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.

## ఏపీ, తెలంగాణలకు చల్లని కబురు

### : హైదరాబాద్‌ను తాకిన నైరుతి



నైరుతి రుతుపవనాలు దేశవ్యాప్తంగా చురుగ్గా పురోగమిస్తున్నాయి. ఇవి తాజాగా తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లోకి ప్రవేశించినట్లు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. రానున్న 4 నుంచి 5 రోజుల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని మిగిలిన ప్రాంతాలన్నింటికీ రుతుపవనాలు విస్తరించడానికి పరిస్థితులు సానుకూలంగా ఉన్నాయని పేర్కొంది.ఆదివారం నాటికి రుతుపవనాల ఉత్తర సరిహద్దు (నార్తర్న్ లిమిట్ ఆఫ్ మాన్‌సూన్) మహారాష్ట్రలోని హర్నై, సోలాపూర్ మీదుగా ప్రయాణిస్తూ.. తెలంగాణలోని హైదరాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ఆంధ్రప్రదేశ్‌లోని కళింగపట్నం వరకు విస్తరించినట్లు వాతావరణ శాఖ తెలిపింది. అక్కడి నుంచి పారాదీప్, బరిపద, ధన్‌బాద్ మీదుగా ముజఫర్‌పూర్ వరకు రుతుపవనాల విస్తరణ కొనసాగుతున్నట్లు స్పష్టం చేసింది.రానున్న 4-5 రోజుల్లో కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని మిగిలిన ప్రాంతాలతో పాటు మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్‌లోని మరికొన్ని ప్రాంతాలకు రుతుపవనాలు విస్తరించనున్నాయి. అలాగే ఒడిశా, ఝార్ఖండ్, బీహార్, దక్షిణ ఛత్తీస్‌గఢ్‌లోని పలు ప్రాంతాల్లోకి కూడా ఇవి ప్రవేశించే అవకాశం ఉందని ఐఎండీ తన తాజా బులెటిన్‌లో వివరించింది. దీంతో తెలుగు రాష్ట్రాల్లో వర్షాకాలం పూర్తిస్థాయిలో ప్రారంభం కానుంది.

RNI No Tel /2012 /4241
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
16 మంగళవారం జూన్ 2026

# జీతాలు నిలిపివేసి వేధిస్తున్నారంటూ కాంట్రాక్ట్ ఉద్యోగిని ఆవేదన

## – 20 ఏళ్లుగా సేవలు.. జీతాలు నిలిపివేసి వేధిస్తున్నారంటూ కాంట్రాక్ట్ ఉద్యోగిని ఆవేదన

## – న్యాయం చేయాలని అధికారులకు వినతి



హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి జూన్ 14

మహేశ్వరం:– మహేశ్వరం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గత 20 సంవత్సరాలకు పైగా కాంట్రాక్ట్ ప్రాతిపదికన విధులు నిర్వహిస్తున్న దానపగారి యాదమ్మ (50) తనకు జీతాల చెల్లింపులో తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. గత ఏడాది నుంచి తనకు రావాల్సిన వేతనాలను సకాలంలో చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, కొందరు అధికారులు, సిబ్బంది ఉద్దేశపూర్వకంగా మానసిక వేధింపులకు పాల్పడుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆమె సంబంధిత అధికారులకు తెలియజేసిన ఫిర్యాదులో, ఆసుపత్రిలో ఎంతోకాలంగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ తన సేవలకు తగిన గౌరవం లభించడం లేదని పేర్కొన్నారు. వేతనాల చెల్లింపులో నిర్లక్ష్యం, విధుల నిర్వహణలో ఒత్తిళ్లు, అవమానకర పరిస్థితులు ఎదుర్కొంటున్నానని తెలిపారు. ఈ కారణాల వల్ల తీవ్ర మనోవేదనకు గురై ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నానని వాపోయారు. గత కొంతకాలంగా జీతాలు నిలిపివేయడం వల్ల కుటుంబ పోషణ కూడా కష్టంగా మారిందని, ఉద్యోగం చేస్తున్నప్పటికీ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని ఆమె పేర్కొన్నారు. తనకు జీతం రాకపోవడానికి కారణమైన డాక్టర్ అమిత్ సిద్ధిక్, హెడ్ సిస్టర్ వసంత, అలీ అనే వ్యక్తుల వల్ల తనకు జీతం రాకుండా చేశారని దీంతో నిరంతర మానసిక ఒత్తిడి కారణంగా తన ఆరోగ్యం దెబ్బతిందని, అనారోగ్యానికి గురయ్యానని తెలిపారు. తనకు రావాల్సిన వేతనాలను వెంటనే చెల్లించి, ఆరోపణలపై నిష్పక్షపాత విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. తనకు ఏదైనా అనర్థం జరిగితే అందుకు కారణమైన వారిపైనే పూర్తి బాధ్యత ఉంటుందని హెచ్చరించారు. అంతేకాకుండా, తన సమస్యపై సంబంధిత అధికారులు స్పందించి న్యాయం చేయాలని, లేనిపక్షంలో మానవ హక్కుల సంఘం సహా ఉన్నత స్థాయి అధికారులను ఆశ్రయించి పోరాటం కొనసాగిస్తానని యాదమ్మ స్పష్టం చేశారు

# ఇందిరమ్మ ఇల్లు ఆపేశారు న్యాయం చేయండి

## ప్రజావాణిలో కలెక్టర్ కు దళిత మహిళ ఫిర్యాదు



మెదక్,జూన్15(హైద్రాబాద్ ఎస్టేట్):
రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని అర్ధాంతరంగా నిలిపివేశారని,ఇందుకు కారణమైన గ్రామ సర్పంచ్ కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరుతూ మెదక్ జిల్లా,పాపన్నపేట మండలం కుర్తివాడ గ్రామానికి చెందిన రేవెళ్ళి సంధ్య సోమవారం కలెక్టరేట్ లో ఏర్పాటుచేసిన ప్రజావాణిలో మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి సమక్షంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రంలో పేర్కొన్న వివరాల ప్రకారం.. తనకు నివసించేందుకు సొంత ఇల్లు లేకపోవడంతో ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకోగా,ఇటీవల ప్రభుత్వం ఇల్లు మంజూరు చేసిందని తెలిపారు.అయితే ఆర్థిక ఇబ్బందుల కారణంగా గ్రామ పెద్దల సూచన మేరకు ఇంటి నిర్మాణ బాధ్యతను కాంట్రాక్టర్‌కు అప్పగించినట్లు పేర్కొన్నారు.కాంట్రాక్టర్ ఇంటి నిర్మాణంలో భాగంగా బేస్‌మెంట్ స్థాయి వరకు పనులు పూర్తి చేసిన అనంతరం,అకస్మాత్తుగా మెటీరియల్ సరఫరా నిలిపివేసి పనులను ఆపివేశాడని ఆరోపించారు.ఈవిషయమై కాంట్రాక్టర్‌ను ప్రశ్నించగా,గ్రామ సర్పంచ్ శ్రీధర్ ఆదేశాల మేరకే పనులు నిలిపివేశానని చెప్పినట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం సర్పంచ్‌ను కలిసి కారణం అడగగా,గత సర్పంచ్ ఎన్నికల్లో తమ కుటుంబం తనకు ఓటు వేయలేదనే కారణంతో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని నిలిపివేసినట్లు స్పష్టంగా తెలిపారని ఆరోపించారు.అంతేకాకుండా, తనను ఆ 30 మంది గెలిపించారని,వారు అనుమతిస్తేనే ఇంటి నిర్మాణం కొనసాగుతుందని,పదేపదే తన ఇంటికి రావద్దని హెచ్చరించినట్లు వినతిపత్రంలో పేర్కొన్నారు.ఇప్పటికే బేస్‌మెంట్ పనులు పూర్తయ్యాయని,ఆదశకు సంబంధించిన ఒక బిల్లును కాంట్రాక్టర్‌కు చెల్లించినప్పటికీ నిర్మాణ పనులు ముందుకు సాగకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు.తన ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని అర్ధాంతరంగా నిలిపివేసిన కాంట్రాక్టర్‌తో పాటు,నిలిపివేతకు కారణమైన గ్రామ సర్పంచ్‌పై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని,తన ఇంటి నిర్మాణం పూర్తయ్యేలా జిల్లా యంత్రాంగం జోక్యం చేసుకుని న్యాయం చేయాలని రేవెళ్ళి సంధ్య ప్రజావాణి ద్వారా జిల్లా కలెక్టర్‌ను కోరారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కొత్తూరి శ్రీనివాస్, బద్రి మల్లేశం,మన్నె వెంకటేశం తదితరులు ఉన్నారు.

దళిత సంఘాల ఆగ్రహం:
రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇల్లు నిర్మాణాన్ని కాంట్రాక్టర్ మరియు గ్రామ సర్పంచ్ అర్ధాంతరంగా నిలిపివేయడం పట్ల మెదక్ జిల్లా దళిత సంఘాల ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.దళిత కుటుంబం పట్ల సర్పంచ్ తీరు సరికాదని,ఇలాంటివి పునరావృతమైతే ఆందోళనలు సైతం చేస్తామని హెచ్చరించారు.

# ఆరుట్లలో చరిత్రాత్మక వేడుకకు సన్నాహాలు..

## ముఖ్యమంత్రి పర్యటన విజయవంతానికి విస్తృత ఏర్పాట్లు

## విద్యా రంగానికి కొత్త దిశ.. ఆరుట్ల మోడల్ విద్యాలయ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి రాక




హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూన్ 15:–
రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం: మంచాల్, మంచాల్ మండలంలోని ఆరుట్ల గ్రామం రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందేలా రూపొందించిన నూతన మోడల్ విద్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఈ నెల 17న రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం కార్యక్రమ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించింది. పర్యటన ఏర్పాట్లలో భాగంగా జిల్లా పరిపాలనాధికారులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు కార్యక్రమ ప్రాంగణాన్ని సందర్శించి ఏర్పాట్ల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, అధికారులతో కలిసి విద్యాలయ ప్రాంగణం, సభా స్థలం, వాహనాల పార్కింగ్, ప్రజల రాకపోకల మార్గాలు, భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ, "ఆరుట్లలో నిర్మితమైన ఈ ఆధునిక విద్యాలయం గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే కేంద్రంగా నిలవనుంది. భవిష్యత్ తరాలకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించాలనే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి ఇది ప్రతీక. ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఈ విద్యాలయం ప్రారంభం కావడం ప్రాంత ప్రజలకు గర్వకారణం" అని పేర్కొన్నారు. అలాగే ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ప్రజలు, పార్టీ కార్యకర్తలు, అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, వైద్య సదుపాయాలు, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలు సమర్థవంతంగా అమలు చేయాలని సంబంధిత అధికారులకు సూచించినట్లు తెలిపారు. విద్యా రంగంలో ఆదర్శవంతమైన మౌలిక వసతులతో రూపొందించిన ఈ మోడల్ విద్యాలయం ప్రారంభం ద్వారా ఆరుట్ల గ్రామం రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు పొందనుందని స్థానిక ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి పర్యటనను పురస్కరించుకుని గ్రామంలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. ఈ సందర్భంలో జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి, ఏసిపి రాజు, పోలీస్ అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రిన్సిపల్ గిరిధర్ గౌడ్ , స్థానిక నాయకులు సమిష్టిగా కృషి చేస్తూ కార్యక్రమం ఘన విజయానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేసే దిశగా ముందుకు సాగుతున్నారు.

# 26న కరాటేలో వరల్డ్ రికార్డ్ పోస్టర్ ఆవిష్కరణ




హైదరాబాద్, జూన్ 15: అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఈనెల 26వ తేదీన కాచిగూడలోని జీవీఆర్ కరాటే అకాడమిలో వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో కరాటేలో వరల్డ్ రికార్డ్ నిర్వహిస్తున్నట్లు అకాడమి డైరెక్టర్ డాక్టర్ జిఎస్ గోపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం కాచిగూడలోని అకాడమిలో వరల్డ్ రికార్డ్ పోస్టర్ను మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మీ రామన్ గౌడ్ తో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా ప్రాముఖ్యత పట్ల యువతలో అవగాహన కల్పించడానికి ఈ వరల్డరికార్ద్ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 26 సెక్లలో 6 మంది విద్యార్థుల తలలపై ఉంచిన 26 ఆపిల్స్ను హ్యాండ్ చాప్ స్ట్రైక్ ద్వారా పగలగొట్టి సరికొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పనున్నట్లు తెలిపారు. ఈ వినూత్న కార్యక్రమం ద్వారా ప్రదర్శన వేగం, కచ్చితత్వం, ధైర్యసాహసాలు, కరాటే నైపుణ్యానికి నిదర్శనంగా నిలుస్తుందన్నారు. సమాజానికి మంచి సందేశం అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రవికుమార్, గంగాధర్, రాథేశ్యామ్ తివారి, కల్పన తివారి, జి.అమృతరెడ్డి, గణసంతోషిణి రెడ్డి, అవిజ్ఞ వెంకట్ రెడ్డి, గౌతమి, అభిషేక్, తదితరులు పాల్గొన్నారు.

# సుమంగళి కన్వెన్షన్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న అందెల శ్రీరాములు యాదవ్



హైదరాబాద్ ఎస్టేట్ మహేశ్వరం ప్రతినిధి కృష్ణ చారి జూన్ 14
మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రాల్లో నూతనంగా నిర్మించబడిన సుమంగళి కన్వెన్షన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రముఖ సామాజికవేత్త, ప్రజానాయకుడు అందెల శ్రీరాములు యాదవ్ గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కన్వెన్షన్‌ను సందర్శించి నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అందెల శ్రీరాములు యాదవ్ మాట్లాడుతూ, ఆధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేసిన సుమంగళి కన్వెన్షన్ ఈ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని, వివాహాలు, సామాజిక మరియు సాంస్కృతిక కార్యక్రమాలకు ఇది ఒక ఉత్తమ వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు.

# డిప్యూటీ సీఎంకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన దంతోజు నరసింహా చారి



హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి
తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్కను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది .డైనమిక్ లీడర్ మాజీ యూత్ అధ్యక్షుడు దంతజు నరసింహ చారి

# 21 ఏళ్ల సేవలకు ఇదే ప్రతిఫలమా..? అంగన్వాడీ టీచర్ కన్నీటి విజ్ఞప్తి

## అంగన్వాడీ కేంద్రం తరలింపుపై ఆవేదన.. అధికారుల జోక్యం కోరుతున్న టీచర్

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూన్ 15:–
హయత్‌నగర్: ప్రాజెక్టు పరిధిలోని ఎన్టీఆర్ నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కొనసాగుతున్న అంగన్వాడీ కేంద్రం భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. గత రెండు దశాబ్దాలకు పైగా అదే పాఠశాల ప్రాంగణంలో అంగన్వాడీ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న సరళ తనకు ఎదురవుతున్న పరిస్థితిపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. సుమారు 21 సంవత్సరాలుగా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తూ సేవలందిస్తున్నానని ఆమె తెలిపింది. అంగన్వాడీ కేంద్రం ద్వారా పరిసర ప్రాంతాల ప్రజలకు అవసరమైన పోషకాహార సేవలు, చిన్నారుల సంరక్షణ కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయని పేర్కొంది. అయితే ఇటీవల పాఠశాల యాజమాన్యం కేంద్రం నిర్వహిస్తున్న గదిని ఖాళీ చేయాలని సూచించడంతో తాను తీవ్ర ఆందోళనకు గురయ్యానని వెల్లడించింది.ప్రస్తుతం అంగన్వాడీ కేంద్రానికి ప్రత్యామ్నాయ భవనం లేకపోవడంతో సేవలు కొనసాగించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని సరళ పేర్కొంది. అద్దె భవనంలో కేంద్రాన్ని నిర్వహించే ఆర్థిక పరిస్థితి తమకు లేదని, దీంతో చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు అందుతున్న సేవలు దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది.ఎన్నో సంవత్సరాలుగా ఎలాంటి అంతరాయం లేకుండా పాఠశాల ప్రాంగణంలోనే అంగన్వాడీ కేంద్రం కొనసాగుతోందని, ఇప్పుడు అకస్మాత్తుగా కేంద్రాన్ని తరలించాలని చెప్పడం బాధాకరమని ఆమె తెలిపింది. ఈ అంశాన్ని మానవతా దృక్పథంతో పరిశీలించి, అంగన్వాడీ కేంద్రాన్ని యథాతథంగా అదే పాఠశాలలో కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, విద్యాశాఖ అధికారులు, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులకు ఆమె విజ్ఞప్తి చేసింది. అంగన్వాడీ కేంద్రం తరలింపు వల్ల సేవలు పొందుతున్న చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు ఇబ్బందులు పడే అవకాశం ఉందని స్థానికులు కూడా అభిప్రాయపడుతున్నారు. సమస్యను త్వరితగతిన పరిష్కరించి కేంద్రం నిరంతరాయంగా కొనసాగేందుకు అధికారులు తగిన చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

# శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి ఆర్థిక సాయం



హైదరాబాద్ ఎస్టేట్ (ప్రతినిధి) మంచాల
ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మంచాల మండల పరిధిలోని లోయపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయానికి తనవంతుగా 21000/– రూపాయలను ఆలయ కమిటీ సభ్యులకు అందజేసిన ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు & టీపీసీసీ సభ్యులు, ఆదిభట్ల మున్సిపాలిటీ చైర్మన్ మర్రి నిరంజన్ ఈ కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ సభ్యులు మెగా వత్ రామకోటి, శంకర్, రవీందర్, మోహన్, శ్రీను,ధర్మ,రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
16 మంగళవారం జూన్ 2026

# అన్నదానం.. మహా దానం..

## బజరంగ్ సేన తెలంగాణ అధ్యక్షులు ఎన్.ఆర్. లక్ష్మణ రావు



హైదరాబాద్, జూన్ 15: పవిత్రమైన అమావాస్య సందర్భంగా, హైదరాబాద్‌లోని కోటి, రాణి పార్క్ సమీపంలో ఉన్న శ్రీ నల్ల పోచమ్మ ఆలయంలో అత్యంత భక్తిశ్రద్ధలతో చండీ హోమం నిర్వహించబడింది. ఈ పవిత్రమైన ఆచారంలో పాల్గొని, శాంతి, శ్రేయస్సు, రక్షణ, సమాజ సంక్షేమం కోసం చండీ దేవి ఆశీర్వాదం పొందడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.హోమం అనంతరం, భక్తులు, సాధారణ ప్రజల కోసం అన్నదాన కార్యక్రమం నిర్వహించబడింది. మత, సామాజిక సేవ పట్ల తమ నిబద్ధతలో భాగంగా బజరంగ్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.ఆర్. లక్ష్మణ రావు, ఆలయ కమిటీతో కలిసి అన్నదాన కార్యక్రమాన్ని సంయుక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై, మతపరమైన కార్యక్రమాలలో పాల్గొని, అన్నదానంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం విజయవంతంగా జరగడానికి తమ సహకారం అందించిన భక్తులు, వాలంటీర్లు, మద్దతుదారులందరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

## మహా శివాలయం గోశాలలో మహా అన్నప్రసాద కార్యక్రమం






హైదరాబాద్ ఎస్టేట్ (ప్రతినిధి) హైదరాబాద్ ఈరోజు లోయర్ ట్యాంక్ బండ్ దగ్గర కొలువుతీరిన భక్తిభావంతో, అంగరంగ వైభవంగా కన్నులపండుగగా జరిగింది. ఈ పవిత్ర కార్యక్రమానికి ఆలయ నిర్వాహకులు మరియు బీజేపీ ధార్మిక్ సెల్ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా కో–కన్వీనర్ శ్రీ గోపాల్ గురుస్వామి ఆహ్వానం మేరకు, బీజేపీ ధార్మిక్ సెల్ రాష్ట్ర కన్వీనర్ శ్రీ సూర్యప్రకాష్ ఆదేశాలతో ధార్మిక్ సెల్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహాశివునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి, విచ్చేసిన భక్తులందరికీ మహా అన్నప్రసాద వితరణ చేశారు. వేద మంత్రాల మధ్య జరిగిన ఈ కార్యక్రమం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. వచ్చిన ముఖ్య అతిథులను శ్రీ గోపాల్ గురుస్వామి సన్మానించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ ధార్మిక్ సెల్ రాష్ట్ర కో–కన్వీనర్ శ్రీ నిరంజన్ దేశాయ్, లిరాష్ట్ర జాయింట్ కన్వీనర్ శ్రీ మణిదీప్ పాల్గొని ఘనంగా పూజలు నిర్వహించారు.
బీజేపీ ధార్మిక్ సెల్ నాయకులు శ్రీ తోలుపు నూరి రమేష్ గౌడ్, జగదీష్ గౌడ్,్. శ్రీనివాస్ గౌడ్, మధు కళ్యాణ్, ధనుష్, సాయికుమార్ తదితరులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.
ఆలయ కమిటీ సభ్యులు మరియు భక్తులు శ్రీ మనోజ్ గుప్తా, నరసింహ, లోకేష్, నవీన్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.సనాతన ధర్మ పరిరక్షణకు, గోసేవకు, భక్తుల సేవకు తాము ఎప్పుడూ ముందుంటామని ధార్మిక్ సెల్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


## అన్ని దానాల కన్నాఅన్నదానం ఎంతో గొప్పది

### కమిటీ చైర్మన్ దండేటి కార్ భగవత్ జి




హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతిదీ చంపాపేట్
శ్రీశ్రీశ్రీ మాత అన్నపూర్ణేశ్వరి అన్నప్రసాద వితరణ కమిటీ చైర్మన్ దండేటి కార్ భగవత్ జి(భగవాన్) ఆధ్వర్యంలో గత 38 మాసాలుగా అమావాస్య రోజు అన్న ప్రసాద కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు కమిటీ చైర్మన్ దండేటి కార్ భగత్ జి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ అన్ని దానాలలో కెల్లా అన్నదానం ఎంతో గొప్పదని తెలిపారు చంపాపేట్ నల్లపోచమ్మ ఎర్ర పోచమ్మ దేవాలయ ప్రాంగణంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాని నిర్వహించారు. సుమారు 500 మందికి అన్న ప్రసాద వితరణ చేపట్టినట్లు తెలిపారు సహకరించిన దాతలు అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రవిముదిరాజ్,సుశీల్ కుమార్,సంతోష్ లడ్డ, , గణసాల వెంకటేష్ ( చింటూ),ఆడేళ్ల రాజా, అండేకార్ వెంకటేష్, టింగ్లికార్ రాజేష్, కంటేకర్ తిలక్ రాజ్, కంటేకర్ విట్టల్, జమాల్ పూర్ శివ.షానవాజ్ హుస్సేనీ, కర్నాటి మనోహర్, ఆడేళ్ల సంపత్, ఇట్టికల సాయికుమార్,ఆనగళ్ల జగదీష్, శ్రీను నాయక్, ఎడ్ల శివరామ్ రెడ్డి, రాదేకుమార్,గుర్రం పావని, ఎస్ సంజీవ్ కుమార్, తిప్పిరెడ్డి స్వాతి, డి సుభాష్, డి సతీష్, డి సందీప్, డి సూర్యన్స్, ఆకుల దీప, రేండ్ల సారయ్య, , మనోజ్, భవాని, సాత్తిరిమహేష్ , ఉపేందర్ చారి, కేకే సూర్య తేజ, ఎం దీపక్, మాడ కుట్నెస్, గాజుల నవీన్ కుమార్ , నల్ల దేవేందర్ , సాయి సాగర్ , విజయ్ కుమార్, కే రాము, ఎస్ సాయికుమార్, ప్రశాంత్ యాదవ్, గూడ శ్రీనివాస్, అభిలాష్, జి సాయికుమార్, గోగిఖర్ రమేష్, తదితరులు పాల్గొన్నారు

## స్పీకర్ అయ్యాను మర్యాదపూర్వకంగా కలిసిన దాడి వీరభద్రరావు



రాజ్యసభ సభ్యునిగా చింతకాయల విజయ్ ను నియమించిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు ని వారి నివాసంలో మాజీ మంత్రివర్యులు దాడి వీరభద్ర రావు మరియు తెలుగుదేశం పార్టీ విశాఖ జిల్లా మాజీ అధ్యక్షులు దాడి రత్నాకర్ కలిసి అభినందించారు. ఉత్తరాంధ్రలో యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తరువాత సుమారు 30 సంవత్సరాలకు తెలుగుదేశం పార్టీ తరపున రాజ్యసభకు విజయ్ ని నియమించినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి మరియు నారా లోకేష్ కి ధన్యవాదాలు తెలియజేశారు . రాజకీయ కుటుంబానికి చెంది చిన్ననాటి నుండి పార్టీలో పనిచేసిన విజయ్ కి రాజ్యసభ సభ్యునిగా పంపడంపట్ల దాడి వీరభద్రరావు హర్షం వ్యక్తం చేశారు.

# ప్రజావాణికి ప్రజల భారీ స్పందన ఒక్కరోజులో 118 ఫిర్యాదులు స్వీకరణ

## సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు.. వెంటనే చర్యలు తీసుకోవాలి

### అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూన్ 15:–
రంగారెడ్డి జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డి దృష్టికి తీసుకువచ్చి మొత్తం 118 ఫిర్యాదులను సమర్పించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రజల సమస్యలను సత్వరంగా పరిష్కరించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. ప్రజలు అందజేసే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు అత్యంత ప్రాధాన్యతతో తీసుకుని త్వరితగతిన పరిష్కరించాలని ఆయన ఆదేశించారు.ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజలకు న్యాయం జరిగేలా ప్రతి అర్జీపై బాధ్యతాయుతంగా స్పందించాలని పేర్కొన్నారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ శాఖకు సంబంధించిన 28 దరఖాస్తులు, ఇతర శాఖలకు సంబంధించిన 90 దరఖాస్తులు అందగా, మొత్తం 118 ఫిర్యాదులు నమోదయ్యాయి. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) అనంతరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మొహర్రం వేడుకలకు యంత్రాంగం సన్నద్ధం.. అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలి

## మొహర్రం నిర్వహణలో నిర్లక్ష్యానికి తావులేదు.. శాఖల సమన్వయంతో చర్యలు వేగవంతం చేయండి







హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూన్ 15:–
రంగారెడ్డి జిల్లా, మొహర్రం పర్వదినాన్ని ఎలాంటి అవాంతరాలు లేకుండా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను వేగంగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డి అధికారులకు సూచించారు. జిల్లా సమీకృత కార్యాలయాల భవన సముదాయంలో సోమవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పండుగ నిర్వహణకు సంబంధించిన అంశాలపై వివిధ శాఖల అధికారులతో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా మైనారిటీ సమాజ ప్రతినిధులు పండుగ సమయంలో అవసరమయ్యే తాగునీటి సదుపాయాలు, పరిశుభ్రత, నిరంతర విద్యుత్ సరఫరా, రోడ్ల మరమ్మతులు, వైద్య సహాయం, ట్రాఫిక్ నిర్వహణ, భద్రతా చర్యలు వంటి అంశాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వారి సూచనలు, అవసరాలను పరిశీలించిన అదనపు కలెక్టర్ సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రతి సమస్యను ముందస్తుగానే పరిష్కరించాలని ఆదేశించారు.పండుగ రోజుల్లో ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన మౌలిక వసతులను సిద్ధం చేయాలని, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఆయన పేర్కొన్నారు. వేడుకలు ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా జరిగేలా అన్ని విభాగాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ సమావేశంలో మైనారిటీ సంక్షేమ శాఖతో పాటు పంచాయతీరాజ్, రోడ్లు–భవనాల శాఖ, విద్యుత్ విభాగం, అగ్నిమాపక శాఖ, మిషన్ భగీరథ, వైద్య ఆరోగ్య శాఖ, పోలీసు మరియు ట్రాఫిక్ విభాగాల అధికారులు, మైనారిటీ వర్గాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# విద్యార్థినుల మధ్య ఉప ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలు..

## ప్రభుత్వ విద్యకు అండగా కొత్త సంకల్పాలు

## బాలికలతో కలిసి భోజనం చేసిన ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క





హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూన్ 15:–
మొయినాబాద్, తెలంగాణ ఉప ముఖ్యమంత్రి తన జన్మదినాన్ని ప్రత్యేకంగా ప్రభుత్వ విద్యాసంస్థలోని విద్యార్థినులతో కలిసి జరుపుకోవడం విశేషంగా నిలిచింది. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లో ఉన్న బాలికల నివాస విద్యాలయాన్ని సందర్శించిన ఆయన, అక్కడి విద్యార్థినులతో ఆత్మీయంగా మమేకమయ్యారు. సంప్రదాయ వేడుకలకు భిన్నంగా పాఠశాల ప్రాంగణంలోనే బాలికల మధ్య కేక్ కట్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో కలిసి భోజనం చేసిన ఉప ముఖ్యమంత్రి, వారికి అందుతున్న ఆహారం, వసతి, విద్యా సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. చిన్నారుల అభిప్రాయాలను నేరుగా విని, అవసరమైన సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ విద్యను మరింత బలోపేతం చేయడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న లక్షలాది మంది విద్యార్థులకు పోషకాహారంతో కూడిన ఉదయ భోజన కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. అలాగే ఉన్నత విద్య అభ్యసిస్తున్న ప్రభుత్వ కళాశాలల విద్యార్థుల సంక్షేమం కోసం కూడా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఆర్థిక పరిస్థితులు ఎలా ఉన్నా ప్రతిభావంతులైన విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించేలా అన్ని వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభివృద్ధి కోసం అవసరమైన నిధుల విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. గతంలో నిర్లక్ష్యానికి గురైన పలు సంక్షేమ అంశాలకు ప్రస్తుత ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ, ఉన్నత పదవిలో ఉన్నప్పటికీ సాధారణ విద్యార్థుల మధ్య జన్మదినాన్ని జరుపుకోవడం ఉప ముఖ్యమంత్రి వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తోందని కొనియాడారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న పిల్లల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ఫలితాలిస్తున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ, విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే అవసరమైన సామగ్రి అందడం ఆనందంగా ఉందన్నారు. తమ మధ్యకు వచ్చిన ఉప ముఖ్యమంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వివిధ సంస్థల ప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా బహదూర్ పుర నియోజకవర్గంలో టీఆర్ఎస్ పార్టీ జెండా పండుగ

# యువత రాజకీయాల్లోకి రావాలి







హైదరాబాద్ జూన్ 14 ():
బహదూర్ పుర నియోజకవర్గంలోని షంషీర్ గంజ్ కూడలిలో తెలంగాణ రక్షణ సేన జెండా ఆవిష్కరణ పండుగ హైదరాబాద్ ఇన్చార్జి సాయి మహేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా బహదూర్ పుర ఇన్చార్జ్ రాకేష్ గైక్వాడ్ ( సోను భాయ్ ) మాట్లాడుతూ ఈ యొక్క జెండా పండుగలో హైదరాబాద్ ఇన్చార్జ్ సాయి మహేష్ రావడం చాలా సంతోషంగా ఉందని తెలంగాణ రక్షణ సేన అబ్జర్వర్లు మరియు ఇన్చార్జులు పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని , యువత రాజకీయాల్లోకి రావాలని, కవిత ఆధ్వర్యంలో ఈ ఉత్సాహాన్ని మేము ఎప్పుడు కొనసాగిస్తామని తెలిపారు. అబ్జర్వర్ గీతా గౌడ్, అనిత చౌదరి స్టేట్ లీడర్, నందాల అనిల్ కుమార్ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే యాకత్ పుర కట్టల శారద గౌలిపుర నాయకురాలు, చింతల కళ్యాణ్ చంద్రాయన గుట్ట వైస్ ప్రెసిడెంట్, నితిన్ గరుడు, జ్యోతి కులకర్ణి, రాజ్ కుమార్, తదితరులు పాల్గొని ఈ యొక్క కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

RNI No Tel / 2012 /4241
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



# జర్నలిస్టుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి


## – అదనపు కలెక్టర్‌కు 'టీఎస్‌జేయూ' వినతిపత్రం

హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి కరీంనగర్
కరీంనగర్ జూన్ 15..ర్నలిస్టుల ఇళ్ల స్థలాలు, గృహ నిర్మాణం, హెల్త్ కార్డుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ (టీఎస్‌జేయూ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డికి వారు వినతిపత్రం సమర్పించారు. నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్లో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ. అనిల్ కుమార్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీ.అనిల్ కుమార్, జిల్లా అధ్యక్షుడు వేల్పుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తూ అహర్నిశలు శ్రమిస్తున్న జర్నలిస్టుల సంక్షేమం నిర్లక్ష్యానికి గురవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో గతంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేసినప్పటికీ, ఇప్పటి వరకు ఎన్‌ఓసీలు మంజూరు చేయలేదని తెలిపారు. వెంటనే ఎన్‌ఓసీలు జారీ చేసి, ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకాన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అలాగే జర్నలిస్టుల హెల్త్ కార్డులు అన్ని ప్రైవేట్ ఆస్పత్రుల్లో అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌జేయూ మంచిర్యాల జిల్లా కార్యదర్శి అరుణ్ కుమార్, రాష్ట్ర నాయకులు సంపత్, కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొడిగె సురేష్, కోశాధికారి సూదుల వెంకటరమణ, ఉపాధ్యక్షుడు పడకంటి శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ భాస్కర్, జాయింట్ సెక్రటరీలు సతీష్, ఆవుల శ్రీనివాస్, ఈసీ సభ్యుడు చింతం వెంకటేష్, యూనియన్ సభ్యులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గ ఎన్నిక :
ఇటీవల నిర్వహించిన టీఎస్‌జేయూ జిల్లా కమిటీ నూతన కార్యవర్గాన్ని ఈ సందర్భంగా వెల్లడించారు. జిల్లా అధ్యక్షుడిగా వేల్పుల శ్రీనివాస్ పటేల్, ప్రధాన కార్యదర్శిగా బొడిగె సురేష్, కోశాధికారిగా సూదుల వెంకటరమణ, ఉపాధ్యక్షుడిగా పడకంటి శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా భాస్కర్, జాయింట్ సెక్రటరీలుగా సతీష్, ఆవుల శ్రీనివాస్, ఈసీ సభ్యుడిగా చింతం వెంకటేష్ ఎన్నికైనట్లు ప్రకటించారు.





# నిజం దాగదు.. విలేకరి ఆక్రందన.. ఏడుపొద్దుటే కళ్లు తెరిచింది మొదలు,




ఊరూరు తిరిగే ఒంటి మీద నిమ్మళం లేదు!
ఏడి ఏ తప్పు జరిగిందో, ఎవరికి ఏ కష్టం వచ్చిందోనని,
ఎండనకా వాననకా పరుగు తీసే ఈ కాళ్లకు,
కనీసం అరగంట కుదుటపడే తీరిక లేదు!
అద్దెకొంప తప్ప ఆస్తి లేని బతుకైనా,
నీతి కోసం నిలబడే కలానికి మాత్రం అలుపు లేదు. నిజం అక్షరాల్లో పెట్టి లోకానికి చూపిస్తుంటే, అధికార మదం కళ్లు గప్పి బెదిరింపులు వస్తాయి! కానీ, ఏ బెదిరింపుకూ తలవంచని ఈ గుండె, నిజం కోసం నిలబడే ఏ కలానికీ బానిస కాదు! ఇంటి ద్యాస మర్చిపోయి,
పెళ్లాం పిల్లల మొఖం చూసే తీరిక లేకుండా,
సమాజంలోని కుళ్లును కడిగే ప్రయత్నంలో, తన బతుకే ఒక ప్రశ్నార్థకమై మిగిలిపోతుంటే, ఎవరిని అడగాలి? ఎవరికి చెప్పుకోవాలి? మట్టిలోని మాణిక్యాల్ని వెలికి తీయాలని పడే తాపత్రయంలో, ఎందరో శత్రువులను మూటగట్టుకున్నా, మళ్ళీ మర్నాడు సూర్యుడు రాకముందే, తిరిగే చక్రాన్ని ఆపలేక, నిజాన్ని వెలికి తీయాలనే ఆరాటంతో, సమాజపు చీకట్లను చీల్చే వెలుగు కోసం.. నీ దారిలోనే నడుస్తావు అన్నా.. నీ దారిలోనే నడుస్తావు! ఇది పచ్చి.. నిజం.. జర్నలిస్ట్.. అన్నయ్య!

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అండగా స్టార్ కపుల్ రష్మిక విజయ్ దేవరకొండ.

హైదరాబాద్ ఎస్టేట్ 15 జూన్ 2026
నాగర్ కర్నూల్ జిల్లా అచంపేట్ స్టార్ కపుల్ విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న సొంత గ్రామమైన నాగర్కర్నూల్ జిల్లా అచ్చంపేట్ దగ్గర తుమన్ పేట్ స్వగ్రామంలో లో దేవరకొండ ఫౌండేషన్ ఏర్పాటు చేసి తమ ఉదారతతో సమాజానికి ఆదర్శంగా నిలిచారు. ప్రభుత్వ పాఠశాలల్లో 9, 10 తరగతుల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన ప్రతిభావంతులైన 181 మంది విద్యార్థులకు వరుసగా రూ. 10,000, రూ. 5,000 చొప్పున స్కాలర్‌షిప్స్ అందించి తమ గొప్ప మనసును చాటుకున్నారు. నిజానికి ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లల్లో అత్యధికులు పేద కుటుంబాల నుండి వచ్చినవారే. సరైన వనరులు లేకపోయినా కష్టపడి చదివే ఇలాంటి విద్యార్థులకు సెలబ్రిటీలు, వీఐపీలు ఆర్థికంగా చేయూతనిస్తే... అది వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తుంది. విజయ్, రష్మిక దంపతులు చేసిన ఈ సాయం కేవలం కొంత డబ్బు ఇవ్వడం మాత్రమే కాదు, పేద విద్యార్థుల ఆత్మవిశ్వాసాన్ని పెంచి, వారిని ఉన్నతంగా ఎదిగేలా వెన్నుతట్టి ప్రోత్సహించడమే! ప్రముఖులు ఇలా ముందుకు వస్తే ప్రభుత్వ పాఠశాలలు మరింత బలోపేతం అవుతాయి అని విజయ్ దేవరకొండ మాట్లాడారు ఈ కార్యక్రమంలో స్థానిక అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ నూతన దంపతులు విజయ్ దేవరకొండ కుటుంబ సభ్యులు వివిధ గ్రామాల ప్రజలు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని సంతోషం వ్యక్తం చేశారు




# యువ కమ్యూనిస్టుల సమ్మేళనం జయప్రదం చేయండి




సిపియం పార్టీ యన్ టి ఆర్ నగర్ శాఖ ఆధ్వర్యం శాఖ కార్యదర్శి యం గోపి నాయక్ సరూర్ నగర్ సర్కిల్ కార్యవర్గ సభ్యులు కట్ట శ్రీనివాస్ లు ఈ నెల 16-17 న సిపియం పార్టీ తెలంగాణ రాష్ట్ర యువజన సమ్మేళ్లనం వాల్ పోసర్లను రిలీజ్ చేయడం జరిగింది ఈ సందర్బంగా కొత్తపేట బాబు జగ్గజీవన్ భవన్ లో యువ కమ్యూనిస్టుల సమ్మేళ్లనం ను జయప్రదం చేయాలనీ మాట్లాడుతు చదకున్న యువ కులకు ప్రభుత్వ ఉద్వగా అవకాశాలుకల్పించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వలను ఖండించారు యువకులు చదవుకొని ఉద్యోగం రాక ఇబ్బంది పడుతున్నారు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారలోకి వచ్చి మూడు సంవత్సరాలు కావస్తున్న నిరుద్యోగ భృతి ఇస్తానని చేపి నిరుద్యోగులకు మోసం చేసిన కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నిరుద్యోగ భృతి ఇవ్వాలని సిపియం పార్టీ డిమాండ్ చేస్తుంది ఈ కార్యక్రమంలో బి యాదవు యండి ఖాతేజ సార్వర్ మ్మేదిష్ తదితరులు పాల్గొన్నారు

# జిల్లాలో ఆరోగ్య రక్షణ కార్యక్రమాల విజయవంతానికి సమన్వయంతో ముందుకు సాగాలి

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూన్ 15:-
జిల్లాలో ప్రజారోగ్య పరిరక్షణకు చేపడుతున్న వివిధ కార్యక్రమాల అమలుపై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ స్వర్ణకుమారి డయేరియా నియంత్రణ కార్యక్రమం, పోలియో చుక్కల పంపిణీ, నులిపురుగుల నివారణ కార్యక్రమం, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణ టీకా కార్యక్రమాలపై సమగ్ర వివరాలు అందించారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కె. చంద్రారెడ్డి మాట్లాడుతూ, డయేరియా నియంత్రణ కార్యక్రమాన్ని రెండు దశల్లో అమలు చేస్తున్నట్లు తెలిపారు. మొదటి దశలో ఏర్పాట్లు పూర్తి చేసి, రెండో దశలో విస్తృతంగా అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ఓఆర్ఎస్ ద్రావణ ప్యాకెట్లను అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, ఆసుపత్రుల ద్వారా ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. చిన్నారులు, గర్భిణీలు, ఇతర సున్నిత వర్గాలకు అవసరమైన ఆరోగ్య సేవలు వెంటనే అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ నెల 28న నిర్వహించనున్న పోలియో చుక్కల కార్యక్రమాన్ని అన్ని శాఖల సహకారంతో విజయవంతం చేయాలని పేర్కొన్నారు. ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జూలై 13న నిర్వహించే నులిపురుగుల నివారణ కార్యక్రమం కింద ఒకటి నుండి పందొమ్మిది సంవత్సరాల వయస్సు గల పిల్లలకు విద్యాసంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మాత్రలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మొదటి విడతలో పొందలేని పిల్లలకు జూలై 20న ప్రత్యేకంగా మరోసారి అవకాశం కల్పించనున్నట్లు వెల్లడించారు. అలాగే, 14 నుంచి 15 సంవత్సరాల వయస్సు గల బాలికలకు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణ టీకాను అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంపై విద్యార్థినులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి లక్ష్యాలను సాధించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, వైద్య సిబ్బంది, విద్యాశాఖ, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ, పంచాయతీరాజ్ శాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.




# G. O. నంబర్ 15 ను ఎత్తేసి చేనేత కార్మికుల హక్కుల ను పరిరక్షించాలి..

## బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం డిమాండ్:







హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి ఎల్బీనగర్
గత పది రోజులుగా వరంగల్ జిల్లా కేంద్రంలో గల కొత్తవాడ గోపాలస్వామి గుడి వద్ద చేనేత కార్మికులు శాంతియుతంగా నిరసన దీక్ష చేస్తున్నారు. ప్రధానంగా పదేళ్ల క్రితం నుండి ప్రభుత్వం ఎవంఎశీ ద్వారా చేనేత ఉత్పత్తులు బెడ్ షీట్లు, కార్పెట్లు, టవల్స్ మొదలైనవన్నీ కొని ప్రభుత్వ ఆసుపత్రులు, కారాగారాలు, హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలలకు అందించేవారు. దానికి + ా నంబర్ 1 అనుమతించేది అలాగే ఇంతకాలం కొనసాగింది. ఇటీవల ప్రభుత్వం దానికి వ్యతిరేకంగా + ా నంబర్ 15 తీసుకొచ్చి ఎవంఎశీ ద్వారా కాకుండా బహిరంగ టెండర్ ద్వారా తీసుకోవాలని నిర్ణయించింది. అందువల్ల రెండు నెలల నుంచి మొగ్గాల ద్వారా ఉత్పత్తి అయిన వస్త్రాలు కొనక పోవడం వల్ల అవి మూత పడ్డాయి. ఫలితంగా చేనేత కార్మికులు రోడ్డున పడ్డారు. అడుక్కు తినే పరిస్థితి ఉత్పన్నం అయింది. కాబట్టి బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం డిమాండ్ చేసేదేమిటంటే తక్షణమే + ా నంబర్ 15 రద్దుచేసి పాత పద్ధతి ద్వారా అంటే టెస్కో ద్వారా నే చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేసి చేనేత కార్మికుల ను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం. అది కూడా ఈ నెల 14 లోపు జరుగకుంటే 15 నాడు హైదరాబాద్ లో గల రాష్ట్ర ఎవంఎశీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరిస్తున్నాము. అంతకు ప్రభుత్వంలో చలనం లేకుంటే దీనిని రాష్ట్ర వ్యాప్త ఉద్యమంగా విస్తరింప చేసి ప్రభుత్వాన్ని స్తంభింప చేస్తామని బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం చైర్మన్ శ్రీ టీ చిరంజీవులు గారు హెచ్చరించారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా చీఫ్ కో ఆర్డినేటర్ డాక్టర్ కె వీరస్వామి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కూరపాటి రమేష్, చేనేత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ ఎర్రమాద వెంకన్న, రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు డాక్టర్ కొణతం కృష్ణ, డాక్టర్ అన్వార్ వేణు, చెన్న శ్రీకాంత్, జిల్లా ముఖ్య నాయకులు శ్రీ రాజగోవిందు, డాక్టర్ సూర్య కిరణ్, డాక్టర్ ఏం జనార్ధన్, తుమ్మ తిరుపతి, కందకట్ల సురేష్, వద్నాల నరేందర్, డి సూర్యనారాయణ మూర్తి, ప్రొఫెసర్ మురళీమనోహర్, టి పి సి సి చేనేత విభాగం అధ్యక్షులు చిప్ప వెంకటేశ్వర్లు మొదలగు వారు హాజరై ప్రసంగించినారు. దాదాపు 600మంది చేనేత కార్మికులు ఈ శాంతియుత నిరసనలో పాల్గొన్నారు. డాక్టర్ కె వీరస్వామి చీఫ్ కో - ఆర్డినేటర్ బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటి

# ఇబ్రహీంపట్నంలో నిర్మాణ కార్మికుల ఐక్యత గర్జన..

## వందలాది ద్విచక్ర వాహనాలతో శక్తి ప్రదర్శన

## నిర్మాణ రంగంలో కొత్త అధ్యాయం.. శ్రామికుల భారీ సమీకరణతో కీలక నిర్ణయాలు

## ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అధ్యక్షులు ఎంపల్ల గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూన్ 15:-
ఇబ్రహీంపట్నం: ఇబ్రహీం నియోజకవర్గంలోని భవన నిర్మాణ కార్మికులు సోమవారం 500 మందితో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నియోజకవర్గ కేంద్రంలోని వైష్ణవి గార్డెన్స్‌లో బహిరంగ సభ నిర్వహించి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. మంచాల, యాచారం, ఇబ్రహీంపట్నం మండలాలకు చెందిన కార్మికులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మికుల యూనియన్ రాష్ట్ర నాయకులు ఐలయ్య సూచనల మేరకు నియోజకవర్గ అధ్యక్షుడు ఎంపల్ల గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. భవన నిర్మాణ కార్మికులంతా ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. మూడు మండలాల్లో సెంట్రింగ్ మేస్త్రీలు, కూలీలు రేట్లు పెంచడంతో తాపీ మేస్త్రీలు, గుత్తేదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఇంటి నిర్మాణ పనులకు స్క్వేర్ ఫీట్‌కు రూ.320 నుంచి రూ.400 వరకు ధరలను నిర్ణయించినట్లు వెల్లడించారు. నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు పూర్తి బాధ్యత యూనియన్‌దేనని స్పష్టం చేశారు. యూనియన్‌తో అగ్రిమెంట్ చేసుకున్న ఇంటి యజమానులకు వారి పెట్టుబడికి పూర్తి భరోసా కల్పిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ రంగానికి సంబంధించిన మేనిఫెస్టోను విడుదల చేశారు. రెండు రోజుల్లో పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. మేనిఫెస్టో నిబంధనలను ఉల్లంఘించి తక్కువ ధరలకు పనులు చేపడితే రూ.50 వేల నుంచి రూ.1 లక్ష వరకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అలాగే నియోజకవర్గంలోని కార్మికులకు యూనియన్ తరపున గుర్తింపు కార్డులు అందజేస్తామని, గుర్తింపు కార్డు లేని వారు పనులు చేయరాదని తెలిపారు. ఇతర మండలాల నుంచి వచ్చి పనిచేస్తే రూ.20 వేల జరిమానా విధిస్తామని పేర్కొన్నారు.

భవన నిర్మాణ రంగంలో కార్మికుల హక్కుల పరిరక్షణ, పనుల్లో క్రమబద్ధత తీసుకురావడమే ఈ చర్యల ప్రధాన ఉద్దేశమని యూనియన్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచాల మండలం అధ్యక్షుడు ముర్రి ఐలయ్య, మంచాల మండల అధ్యక్షుడు కాలే మల్లేష్, యాచారం మండలం అధ్యక్షుడు సిద్ధం రవి తదితరులు భవన నిర్మాణ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
16 మంగళవారం జూన్ 2026

## రక్తదాన శిబిరంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న...

### బిజెపి నాయకులు ముత్యాల వెంకటేశ్వరరావు (ఎం.వి.ఆర్)






ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని సన్ క్యాస్టల్ హోటల్‌లో ఆదివారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి ముఖ్యఅతిథిగా ఎం.వి.ఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సర్వేజనా ఐక్యవేదిక వ్యవస్థాపకులు, ఎన్ హెచ్ ఆర్ పి ఎఫ్ హ్యూమన్ రైట్స్ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు కోరిబిల్లి పరమేశ్వరరావు (పరి) ఆధ్వర్యంలో మరియు శ్రీ సూర్య అభయాంజనేయ బ్లడ్ సెంటర్ వారి సమక్షంలో ఈ భారీ రక్తదాన శిబిరం విజయవంతంగా నిర్వహించబడింది.

రక్తదాతలను అభినందించిన ఎం వి ఆర్.... ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎం.వి.ఆర్ శిబిరాన్ని సందర్శించి, రక్తదానం చేస్తున్న యువతీ యువకులను, దాతలను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎం వి ఆర్ మాట్లాడుతూ... ప్రాణాపాయంలో ఉన్న వారిని కాపాడటానికి రక్తదానం ఎంతో ఉత్తమమైన మార్గమని పేర్కొన్నారు. సమాజంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని జరగాలని ఆకాంక్షిస్తూ, ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన కోరిబిల్లి పరమేశ్వరరావు (పరి) ని మరియు రక్త సేకరణ చేసిన బ్లడ్ సెంటర్ సిబ్బందిని ఆయన శ్లాఘించారు. సకాలంలో రక్తం అందడం వల్ల ఎన్నో ప్రాణాలను కాపాడవచ్చున్నారు. స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేసిన ప్రతి ఒక్కరూ అభినందనీయులన్నారు. అనంతరం, ఘనంగా రక్తదాన శిబిరం

కార్యక్రమ నిర్వాహకులు కోరిబిల్లి పరమేశ్వరరావు (పరి) మాట్లాడుతూ... తమ పిలుపు మేరకు రక్తదానం చేయడానికి తరలివచ్చిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం రక్తదాతలకు ముఖ్యఅతిథి ఎం.వి.ఆర్ గారి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ సూర్య అభయాంజనేయ బ్లడ్ సెంటర్ వైద్య సిబ్బంది, సర్వేజనా ఐక్యవేదిక ప్రతినిధులు, ఎన్ హెచ్ ఆర్ పి ఎఫ్ హ్యూమన్ రైట్స్ సభ్యులు తో పాటు ఎం వి ఆర్ యువసేన సభ్యులు గైపూరి రాజు, యేపూరి వాసు, సత్తి మణికంఠ, గంటా సూరిబాబు , స్థానిక ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు

## పేకాట శిబిరంపై పోలీసుల మెరుపు దాడి



జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మరియు అనకాపల్లి సబ్ డివిజన్ అదనపు ఎస్పీ ఎం.శ్రావణి ఆదేశాల మేరకు, జిల్లాలో అసాంఘిక కార్యకలాపాల అణచివేతలో భాగంగా పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా కె.కోటపాడు సిఐ కృష్ణ పర్యవేక్షణలో, ఏ.కోడూరు ఎస్సై కె.సంతోష్ కుమార్ తమ సిబ్బందితో కలిసి నిన్న రాత్రి కొరువాడ గ్రామంలో మెరుపు దాడి నిర్వహించారు. గ్రామంలో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న జూద స్థావరంపై దాడి చేసి, నిర్వాహకులతో పాటు మొత్తం 14 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రూ. 1,80,000/- (ఒక లక్షా ఎనభై వేల రూపాయలు) నగదుతో పాటు జూదానికి ఉపయోగించిన ఇతర సామాగ్రిలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ, జిల్లాలో చట్టవిరుద్ధమైన జూదం, పేకాట లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారైనా సరే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి అనైతిక పనుల వల్ల ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, ఎక్కడైనా జూదం ఆడుతున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచబడుతాయని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

## మురికి నీటి కాలువల పనులను పరిశీలించిన ఎమ్మెల్యే కొణతాల





ప్రజలకు మెరుగైన పారిశుధ్య వాతావరణాన్ని అందించాలనే లక్ష్యంతో చేపడుతున్న కాలువల శుభ్రత మరియు మురుగునీటి పారుదల పనులను మాజీ మంత్రివర్యులు, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కాలువలో పేరుకుపోయిన చెత్త, మురుగును తొలగించే పనుల పురోగతిని అధికారులు మరియు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని కాలువలు పూర్తిగా శుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం ఉండకూడదని అధికారులకు ఆదేశించారు. కాలువల శుభ్రతతో పాటు మురుగునీటి సాఫీ ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న చెత్త, పొదలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ప్రజారోగ్య పరిరక్షణకు పారిశుధ్యం అత్యంత ముఖ్యమని, పట్టణంలో అన్ని ప్రాంతాల్లో శుభ్రత పనులు నిరంతరం కొనసాగించాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పెద్దపల్లికి మణిహారంగా బైపాస్ రోడ్డు.. అభివృద్ధికి సహకరించండి..

### - ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు శ్రీ. చింతకుంట విజయరమణ రావు





హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధిపెద్దపల్లి

పెద్దపల్లి బైపాస్ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం రోజున ఆర్అండ్‌బీ అధికారులు, ఆర్డీవో మరియు స్థానిక నాయకులతో కలిసి పరిశీలించిన గౌరవ ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు శ్రీ. చింతకుంట విజయరమణ రావు గారు..

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణ రావు గారు మాట్లాడుతూ...

పట్టణంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని రూ. 82 కోట్ల నిధులతో చేపడుతున్న బైపాస్ రోడ్డు నిర్మాణం చారిత్రాత్మక నిర్ణయమని పేర్కొన్నారు. రహదారి నిర్మాణానికి అవసరమైన భూసేకరణలో రైతులు సహకరిస్తుండటం అభినందనీయమని అన్నారు. భూసేకరణ ప్రక్రియకు సంబంధించి అధికారులు త్వరలోనే నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిపారు. బైపాస్ రోడ్డు అందుబాటులోకి వస్తే భారీ వాహనాలు పట్టణంలోకి ప్రవేశించాల్సిన అవసరం ఉండదని, దీంతో ట్రాఫిక్ సమస్యతో పాటు రోడ్డు ప్రమాదాలు కూడా గణనీయంగా తగ్గుతాయని చెప్పారు. పెద్దపల్లి పట్టణానికి బైపాస్ రోడ్డు నిర్మించాలని ప్రజలు ఎన్నో ఏళ్లుగా కోరుతున్నప్పటికీ గత పాలకులు పట్టించుకోలేదన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు బైపాస్ రోడ్డు నిర్మాణానికి రూ.82 కోట్ల నిధులు మంజూరు చేయించామని ఎమ్మెల్యే విజయరమణ రావు గారు వెల్లడించారు. ప్రస్తుతం పనులు ప్రారంభమయ్యాయని, ఏడాదిన్నరలోగా నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని స్పష్టం చేశారు. అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో బొద్దుల గంగయ్య, మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య, కమిషనర్ ఆకుల వెంకటేష్, ఆర్ & బి అధికారులు, పట్టణ కౌన్సిలర్లు, పలు గ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఆట, పాట, చదువు బాల్య జీవితానికి బంగారు బాట..

### ఆట,పాట, చదువు అన్ని అంగులతో ఆర్భాటంగా లండన్ కిడ్స్ స్కూల్ ప్రారంభోత్సవం





రంగారెడ్డి జిల్లాఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట్ డివిజన్‌లో ఉదయ్ నగర్ కాలనీ కమ్యూనిటీ హాల్ ఎదురుగా నిర్వహించిన 9 లండన్ ప్రీ కిడ్స్ స్కూల్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ విచ్చేసి ప్రారంభోత్సవం చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులకు నాణ్యమైన విద్య అందించడంలో ప్లే -స్కూల్స్ కీలక పాత్ర పోషిస్తాయన్నారు. అలాగే స్కూల్ యజమానులు సాయి, సునీల్ కుమార్ రెడ్డి, రూప రాణి లు మాట్లాడుతూ..

చిన్నపిల్లలకు కేవలం ఆటపాటలు మాత్రమే కాకుండా మొక్కలు నాటడం, అన్ని మతాల పండుగలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. పిల్లలకు శారీరకంగా మాత్రమే కాకుండా మానసికంగా దృఢంగా అవ్వడం కోసం ఈవెంట్స్ కూడా నిర్వహిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మాజీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి, మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవీందర్, చంపాపేట్ డివిజన్ అధ్యక్షులు రవీందర్ రెడ్డి, సిద్ధాంత్, నూతి శ్రీనివాస్, పద్మారెడ్డి అలాగే ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ....

## టిడిపి ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ అధ్యక్షులు దాడి రత్నాకర్







స్థానిక హోటల్ సన్ క్యాస్టల్ నందు ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా సర్వేజనా ఐక్యవేదిక వ్యవస్థాపకులు కోరిబిల్లి పరమేశ్వర్ (పరి) శ్రీ సూర్యభయాంజనేయ బ్లడ్ బ్యాంక్ వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరమును తెలుగుదేశం పార్టీ ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ అధ్యక్షులు దాడి రత్నాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా దాడి రత్నాకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రక్తదానం చేయడం వలన ముగ్గురి ప్రాణాలను కాపాడవచ్చు అని అన్నారు. రక్తదానం చేయడం వలన మన శరీరానికి ఎంతో మేలు కలుగుతుందని అన్నారు. ప్రతిరోజు ఎంతోమంది రోడ్డు ప్రమాదాల్లో, ప్రసూతి సమయంలో, రక్తహీనత వలన బాధపడే రోగులకు రక్తదాతల యొక్క రక్తాన్ని అందించడం జరుగుతుందని తద్వారా మనకు తెలియకుండానే ఎంతోమంది జీవితాలకు వెలుగును ప్రసాదించిన వాళ్లమవుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో రక్తదానం చేసిన పలువురిని అభినందించారు. ఈ రక్తదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న నిర్వాహకులు కోరిబిల్లి పరి ని ప్రత్యేకంగా అభినందించారు ప్రముఖ సంఘ సేవకులు కాండ్రేగుల శ్రీరామ్ రేబాక మధుబాబు ప్రముఖ యూట్యూబ్ హిమబిందు దాడి సంతోష్ బుద్ధ ప్రవీణ్ అబ్దుల్ కలాం సేవ సంగం చైర్మన్ ఆళ్ల ప్రవీణ్ కర్రీ అప్పాజీ, ఆడారి రవి కుమార్, కరాటి ఈశ్వరరావు కాండ్రేగుల రవి సూరంపూడి హేమ పవన్ కిరణ్ తదితరులు పాల్గొన్నరూ.

## అంబరాన్నంటిన సంబరాలతో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు జన్మదిన వేడుకలు.





విశాఖ రూరల్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు, పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్‌బాబు జన్మదిన వేడుకలను సబ్బవరం మండలంలో ఎన్డీఏ కూటమి నాయకులు అంబరాన్నంటిన సంబరాలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం 2 గంటల నుంచి కోలాటం పోటీలు నిర్వహించారు. సాయంత్రం 7 గంటలకు విశాఖ థ్రిల్లర్ డాన్స్ బేబీ డ్యాన్స్ కార్యక్రమం ఆకట్టుకుంది. అనంతరం సబ్బవరం మారుతి సర్కిల్‌లో ఏర్పాటుచేసిన వేదికపై ఎమ్మెల్యే రమేష్ బాబు జన్మదిన కేక్ కట్ నాయకులకు కార్యకర్తలు అభిమానులకు అందజేసి వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఈ సందర్భంగా సేవా కార్యక్రమాల్లో భాగంగా మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరించి నగదు బహుమతులు అందజేశారు. విద్యార్థులను ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నాయకులు తెలిపారు. ఎన్డీఏ కూటమి నాయకుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో మండల నాయకులు, వీర మహిళలు, కార్యకర్తలు, ఎమ్మెల్యే అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



# దర్శకుడు క్షమాపణ చెప్పడం తప్పే..

## 'పెద్ది' వివాదంపై అనంత శ్రీరామ్ సంచలన వ్యాఖ్యలు



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, జాన్వీ కపూర్ జంటగా నటించిన 'పెద్ది' చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంది. అయితే, ఆ సినిమాకు సంబంధించిన ఒక వివాదం టాలీవుడ్‌లో కొత్త చర్చకు దారి తీసింది. ఈ చిత్రంలో హీరోయిన్ పాత్రను చూపించిన విధానంపై వచ్చిన విమర్శలకు దర్శకుడు బుచ్చిబాబు సానా క్షమాపణ చెప్పి, కొన్ని సన్నివేశాలను తొలగించడాన్ని ప్రముఖ గేయరచయిత అనంత శ్రీరామ్ బహిరంగంగా తప్పుబట్టారు. ఇది కళాకారుల స్వేచ్ఛకు సంబంధించిన అంశమని చెప్పారు. ఆదివారం జరిగిన 'పెద్ది' చిత్ర సక్సెస్ మీట్‌లో అనంత శ్రీరామ్ మాట్లాడుతూ, దర్శకుడు బుచ్చిబాబు క్షమాపణ చెప్పి ఉండాల్సింది కాదని తన అభిప్రాయాన్ని స్పష్టంగా వెల్లడించారు. "ఒక పాత్రను దర్శకుడు తన ఊహకు తగ్గట్లు సృష్టిస్తాడు. సోషల్ మీడియాలో వచ్చే కొన్ని కామెంట్లకు భయపడి సృజనాత్మకతను పరిమితం చేయకూడదు. దర్శకుడు బుచ్చిబాబు క్షమాపణ చెప్పాల్సిన అవసరం లేదు" అని అనంత శ్రీరామ్ అన్నారు. పల్లెటూరి నేపథ్యంలో సాగే కథలో పాత్రల ప్రవర్తన సహజంగా, కాస్త పచ్చిగా ఉంటుందని, దానిని తప్పుగా అర్థం చేసుకోకూడదని ఆయన వాదించారు.

అసలేం జరిగింది?

స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కిన 'పెద్ది' చిత్రంలో జాన్వీ కపూర్ పోషించిన 'అచ్చియమ్మ' పాత్రను కొన్ని సన్నివేశాల్లో అతిగా, శృంగారభరితంగా చూపించారని, మహిళలను వస్తువుగా చిత్రీకరించేలా (ఆబ్జెక్టిఫికేషన్) కెమెరా కోణాలు ఉన్నాయని సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ఈ ట్రోలింగ్‌పై స్పందించిన దర్శకుడు బుచ్చిబాబు, ప్రేక్షకులను ఇబ్బంది పెట్టడం తన ఉద్దేశం కాదని పేర్కొంటూ బహిరంగంగా క్షమాపణ చెప్పారు. అంతేకాకుండా, ప్రేక్షకులు అభ్యంతరం వ్యక్తం చేసిన కొన్ని షాట్లను సినిమా నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించారు. ఏఆర్ రెహమాన్ సంగీతం సినిమా విజయంలో కీలక పాత్ర పోషించగా, రామ్ చరణ్ నటనకు ప్రశంసలు దక్కుతున్నాయి. అయితే, దర్శకుడు ఒకవైపు ప్రేక్షకుల మనోభావాలను గౌరవిస్తూ సినిమాకు మార్పులు చేయగా, మరోవైపు అనంత శ్రీరామ్ వంటి వారు కళాత్మక స్వేచ్ఛను సమర్థించడం ఈ వివాదానికి కొత్త కోణాన్ని ఇచ్చింది.

## ప్రజలు కోరారు.. అందుకే రాజకీయాల్లోకి : రాఘవ లారెన్స్



ప్రముఖ నటుడు, కొరియోగ్రాఫర్, దర్శకుడు రాఘవ లారెన్స్ తమిళనాడు రాజకీయాల్లోకి ప్రవేశించడం దాదాపు ఖాయమైంది. ప్రజలు, అభిమానుల నుంచి లభించిన విశేష మద్దతుతో రాజకీయ అరంగేట్రంపై తాను "సానుకూల నిర్ణయం" తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. దీనిపై త్వరలోనే పూర్తిస్థాయి ప్రకటన వెలువడనుందని ఆయన తెలిపారు. ఆదివారం చెన్నైలోని తన నివాసంలో అభిమానులతో సమావేశమైన అనంతరం లారెన్స్ మీడియాతో మాట్లాడారు. "అనేకమంది నన్ను రాజకీయాల్లోకి రావాలని ప్రోత్సహించారు. ప్రజలే నన్ను ఆహ్వానిస్తుండటం సంతోషంగా ఉంది. అందుకే ఈ విషయంలో సానుకూల నిర్ణయం తీసుకున్నాను" అని ఆయన పేర్కొన్నారు. త్వరలోనే తన తల్లి, మద్దతుదారులతో భారీ సమావేశం నిర్వహించి, తన రాజకీయ ప్రయాణానికి సంబంధించిన కీలక వివరాలను వెల్లడిస్తానని వివరించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన ముఖ్యమంత్రి విజయ్, తిరుచ్చి తూర్పు నియోజకవర్గ సభ్యత్వానికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఆ స్థానానికి జరగబోయే ఉప ఎన్నికలో విజయ్ నేతృత్వంలోని 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) పార్టీ తరఫున లారెన్స్ పోటీ చేస్తారనే ఊహాగానాలు గత కొంతకాలంగా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆయన చేసిన తాజా ప్రకటన రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది. గతంలో లారెన్స్ ఒక వీడియో సందేశం ద్వారా తన సేవా కార్యక్రమాలను ప్రస్తావిస్తూ, రాజకీయాల్లోకి రావాలా వద్దా అనే అంశంపై ప్రజల అభిప్రాయం కోరారు. దానికి విశేష స్పందన లభించడంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. పాఠశాలలు, దేవాలయాల సమీపంలోని మద్యం దుకాణాలను మూసివేయాలన్న టీవీకే విధానాలను ఆయన ప్రశంసించారు. దీంతో ఆయన విజయ్ పార్టీలో చేరడం ఖాయమని ప్రచారం జరుగుతోంది. పార్టీ సభ్యత్వం, పోటీ చేసే స్థానంపై త్వరలోనే పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న విజయ్–రష్మిక.. విద్యార్థులకు అండగా కొత్త దంపతులు



స్టార్ దంపతులు విజయ్ దేవరకొండ, రష్మిక మందణ్ణ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. తాము ప్రకటించినట్టుగానే సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. విజయ్ తండ్రి జన్మించిన తెలంగాణలోని అచ్చంపేట మండలంలోని 9, 10వ తరగతి విద్యార్థులకు అండగా నిలుస్తున్నట్లు ప్రకటించారు. ఈ విషయాన్ని విజయ్ దేవరకొండ స్వయంగా సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. ఈ మేరకు విజయ్ తన 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతాలో ఓ పోస్ట్ పెట్టారు. "మా నాన్న పుట్టిన చిన్న పల్లె తుమ్మనపేటకు బయలుదేరాం. ఈ ఏడాది ఫిబ్రవరిలో నేను, రష్మిక మా ఒక చిన్న కలను ప్రకటించాం. అచ్చంపేట మండలంలోని 9, 10 తరగతుల విద్యార్థులను ప్రోత్సహించాలన్నదే మా లక్ష్యం" అని పేర్కొన్నారు. విజయ్ పోస్ట్‌ను రష్మిక రీషేర్ చేస్తూ తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఉదయ్‌పూర్‌లో వివాహ బంధంతో ఒక్కటైన ఈ జంట, 'దేవరకొండ ఫౌండేషన్' ద్వారా తుమ్మనపేటలోని 44 ప్రభుత్వ పాఠశాలల్లో 9, 10వ తరగతి చదివే విద్యార్థులకు విద్యా సహాయం అందిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల ఫీజులు చెల్లించడం, వారికి అవసరమైన నోట్‌బుక్స్, ఇతర స్టడీ మెటీరియల్‌ను అందించనున్నారు. తద్వారా తల్లిదండ్రులపై ఆర్థిక భారం తగ్గించడంతో పాటు ఆర్థిక కారణాలతో చదువు మధ్యలో ఆగిపోకుండా చూడాలన్నది వీరి సంకల్పం. ఇక సినిమాల విషయానికొస్తే, వివాహం తర్వాత విజయ్, రష్మిక తొలిసారిగా 'రణబాలి' అనే పీరియడ్ డ్రామా చిత్రంలో కలిసి నటిస్తున్నారు. గతంలో 'గీత గోవిందం', 'డియర్ కామ్రేడ్' వంటి విజయవంతమైన చిత్రాల్లో నటించిన ఈ జంటకు, 'రణబాలి' మూడో చిత్రం కానుంది. 1850ల నాటి చారిత్రక వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. చరిత్ర పుస్తకాల్లో నమోదుకాని, బ్రిటిష్ వారు తప్పుగా ప్రచారం చేసిన కొన్ని కీలక సంఘటనల ఆధారంగా ఈ చిత్రం కథ సాగుతుందని సమాచారం.

## అమరావతిలో బాలయ్య–కొరటాల సినిమా లాంచ్..

### ముహూర్తానికి ముఖ్య అతిథిగా హాజరు కానున్న సీఎం చంద్రబాబు!





నటసింహం నందమూరి బాలకృష్ణ, స్టార్ డైరెక్టర్ కొరటాల శివ కలయికలో రాబోతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం (చీదీఖ112) ప్రారంభోత్సవానికి రంగం సిద్ధమైంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ముహూర్తపు వేడుకను సినీ పరిశ్రమ సంప్రదాయాలకు భిన్నంగా, అత్యంత వైభవంగా నిర్వహించేందుకు చిత్ర బృందం భారీ ఏర్పాట్లు చేస్తోంది. హైదరాబాద్‌లోని ఫిలిం స్టూడియోలకు బదులుగా, ఏపీ రాజధాని అమరావతిని ఈ వేడుకకు వేదికగా ఎంచుకున్నారు. జూన్ 25న (గురువారం) అమరావతి సమీపంలోని వెంకటాయపాలెంలో నూతనంగా నిర్మించిన టీటీడీ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ చిత్ర పూజా కార్యక్రమాలు జరగనున్నాయి. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం కేవలం సినీ వేడుకలా కాకుండా, ఒక పండుగ వాతావరణంలో జరగనుంది. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. బాలకృష్ణ కథానాయకుడిగా నటించే ఈ చిత్ర ముహూర్తపు షాట్‌కు సీఎం చంద్రబాబు నాయుడు క్లాప్ కొట్టనుండగా, మంత్రి నారా లోకేశ్ చిత్ర దర్శకుడు కొరటాల శివకు స్క్రిప్ట్‌ను అందజేస్తారని తెలుస్తోంది. ఈ వేడుకలో నందమూరి, నారా కుటుంబ సభ్యులు పాల్గొననుండటంతో దీనికి మరింత ప్రాధాన్యత ఏర్పడింది. సాధారణంగా తన సినిమాల్లో బలమైన సామాజిక సందేశాన్ని వాణిజ్య అంశాలతో జోడించి చెప్పడంలో కొరటాల శివ దిట్ట. ఈసారి బాలకృష్ణ ఇమేజ్, ఆయన బాడీ లాంగ్వేజ్‌కు సరిపోయేలా ఒక పవర్‌ఫుల్ పొలిటికల్, హై–వోల్టేజ్ సోషల్ డ్రామా కథను సిద్ధం చేసినట్లు ఇండస్ట్రీ వర్గాల్లో గట్టిగా ప్రచారం జరుగుతోంది. ఈ యాక్షన్ డ్రామాలో బాలయ్య సరసన నటించే కథానాయిక, ఇతర కీలక నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను ముహూర్తం రోజైన జూన్ 25న అధికారికంగా వెల్లడించాలని చిత్ర యూనిట్ భావిస్తోంది. రాజధాని నడిబొడ్డున జరుగుతున్న ఈ వేడుకపై అభిమానుల్లో, సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

## రష్మిక మందన్న మొదటి A`రేటెడ్ ఫిలిమ్ నేషనల్ క్రష్



రష్మిక మందన్న నేషనల్ క్రష్ రష్మిక మందన్న తన కెరీర్‌లో మొదటిసారి ఒక ఘాటైన రొమాంటిక్ –ఏ– రేటెడ్ సినిమాలో నటించారు. బాలీవుడ్ నటులు షాహిద్ కపూర్, కృతి సనన్, రష్మిక మందన్న ప్రధాన పాత్రల్లో నటించిన –కాక్‌టెయిల్ 2– చిత్రానికి సెన్సార్ బోర్డ్ తాజాగా ూూ సర్టిఫికేట్ జారీ చేసింది. సాధారణంగా రష్మిక ఇప్పటివరకు నటించిన సినిమాలన్నీ ఖ లేదా యుఏ సర్టిఫికేట్‌లతోనే వచ్చాయి. గతంలో –యానిమల్– చిత్రానికి –ఏ– సర్టిఫికేట్ వచ్చినా.. అది భారీ రక్తపాతం, వయలెంట్ యాక్షన్ వల్ల వచ్చింది. కానీ ఇప్పుడు రానున్న –కాక్‌టెయిల్ 2– మాత్రం పూర్తిగా ఘాటైన శృంగార సన్నివేశాలు, రొమాంటిక్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో నిండి ఉండటం వల్లే వయోజనులకు మాత్రమే (అడల్ట్స్ ఓన్లీ) అని సెన్సార్ బోర్డు తేల్చేసింది. 5 ఈ శుక్రవారం –జూన్ 19న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కాబోతున్న ఈ సినిమా అడ్వాన్స్ బుకింగ్స్ ఇప్పటికే కొన్ని పరిమిత స్క్రీన్లలో ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలోనే ఈ చిత్రానికి –ఏ– సర్టిఫికేట్ లభించిన విషయం వెలుగులోకి వచ్చింది. రష్మికతో పాటు గ్లామరస్ బ్యూటీ కృతి సనన్‌కు కూడా ఇది కెరీర్‌లో మొదటి అడల్ట్ ఫిల్మ్ కావడం గమనార్హం. ఈ చిత్రంలో కృతి సనన్ మునుపెన్నడూ చూడని బోల్డ్ – గ్లామ్ లుక్‌లో కనిపించనున్నారు. –తేరే ఇష్క్ మే– చిత్రంలో ఎంతో ఇంటెన్స్ రోల్ పోషించిన కృతి.. ఇందులో ఇలాంటి పూర్తి బోల్డ్ అవతారంలోకి మారడం చూసి అభిమానులు సైతం షాక్‌కు గురవుతున్నారు. గతంలో 2012లో వచ్చిన –కాక్‌టెయిల్– చిత్రం సైఫ్ అలీ ఖాన్, దీపికా పదుకోన్, డయానా పెంటిల మధ్య నడిచే ముక్కోణపు ప్రేమకథగా వచ్చి బాక్సాఫీస్ వద్ద పెద్ద విజయం సాధించింది. ముఖ్యంగా ఆ సినిమా దీపికా పదుకోన్ కెరీర్‌ను మలుపు తిప్పింది. అయితే ఆ మొదటి భాగం సెకండ్ హాఫ్‌లో కాస్త మెలోడ్రామాగా మారినా... ఈ సరికొత్త సీక్వెల్ మాత్రం మొదటి నుండి చివరి వరకు చాలా కూల్‌గా, హాయిగా సాగిపోతుందని నిర్మాత దినేష్ విజన్ ట్రైలర్ లాంచ్‌లో వెల్లడించారు. అయినా థియేటర్లలో యూత్‌ను ఆకట్టుకునేలా ఇందులో బోల్డ్ సీన్స్ మోతాదు కాస్త గట్టిగానే ఉన్నట్లు తెలుస్తోంది. సినిమా ట్రైలర్‌కథనం చూస్తే.. 2012 నాటి మొదటి భాగం టెంప్లేట్‌నే మేకర్స్ ఫాలో అయినట్లు స్పష్టమవుతోంది. ప్రతి ఫ్రేమ్‌లోనూ విపరీతమైన స్టైల్, అందమైన సముద్ర తీరాలు, హాట్‌నెస్ – సెక్సీనెస్ కవ్విస్తూనే ఉన్నాయి. అయితే ఈ ప్రోమో కేవలం గ్లామర్‌ను నమ్ముకుని కాస్త డొల్లగా ఉందనే విమర్శలు కూడా వస్తున్నాయి. సినిమాలో ఏదైనా బలమైన కంటెంట్ ఉందా లేదా అనేది కేవలం ట్రైలర్ చూసి ఇప్పుడే అంచనా వేయలేం. ఈ సినిమాలో ఒక ఆసక్తికరమైన ట్విస్ట్ ఉందని... ఇది ఒక క్వీర్ –స్వలింగ ప్రేమకథ అనే పుకార్లు కూడా గట్టిగా వినిపిస్తున్నాయి. దీనిపై క్లారిటీ రావాలంటే జూన్ 19 వరకు ఆగాల్సిందే. మొదటి భాగం –కాక్‌టెయిల్– అంతటి భారీ బ్లాక్‌బస్టర్ కావడానికి సంగీత దర్శకుడు ప్రీతమ్ అందించిన అద్భుతమైన పాటలు ఒక ముఖ్య కారణం. కానీ ఈ సీక్వెల్ చిత్రానికి సంబంధించిన ప్రోమో – సౌండ్‌ట్రాక్ మొదటి భాగం అంత ఆకట్టుకునేలా లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఏదేమైనా.. షాహిద్ కపూర్‌తో పాటు కృతి సనన్, రష్మిక మందన్నల బోల్డ్ అండ్ రొమాంటిక్ కెమిస్ట్రీ ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. మరి ఈ ఘాటైన రొమాంటిక్ ఎంటర్‌టైనర్ బాక్సాఫీస్ వద్ద ఎలాంటి రికార్డులు సృష్టిస్తుందో వేచి చూడాలి.

## భారీ అంచనాలతో జులై 3న 'నాగబంధం : ది సీక్రెట్ ట్రెజర్'



యువ నటుడు విరాట్ కర్ణ హీరోగా, అభిషేక్ నామా దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ చిత్రం 'నాగబంధం: ది సీక్రెట్ ట్రెజర్'. మైథలాజికల్ ఫాంటసీ అడ్వెంచర్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ సినిమాను జులై 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఈ చిత్రంలో నభా నటేష్, ఐశ్వర్య మీనన్ కథానాయికలుగా నటిస్తున్నారు. గతంలో విడుదలైన ఈ సినిమా టీజర్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. విజువల్స్, కాన్సెప్ట్ పరంగా సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. రహస్య నిధి అన్వేషణ, పురాణ గాథల నేపథ్యంతో కూడిన కథాంశంతో ఈ చిత్రం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందిస్తుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. తాజాగా 'స్వామి వారి రథయాత్ర' పేరుతో చేపట్టిన ప్రచార కార్యక్రమం సినిమాపై మరింత ఆసక్తిని పెంచింది. అభిషేక్ పిక్చర్స్, ఎన్ఐకే స్టూడియోస్ బ్యానర్లపై తెరకెక్కుతున్న ఈ చిత్రంలో జగపతి బాబు, మహేష్ మంజ్రేకర్, మురళీ శర్మ, దక్షా నగార్కర్, రిషబ్ సాహ్నీ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. భారీ తారాగణం, ఉన్నత సాంకేతిక విలువలతో వస్తున్న 'నాగబంధం' చిత్రం జులై 3న థియేటర్లలో ప్రేక్షకులను ఏ మేరకు ఆకట్టుకుంటుందో వేచి చూడాలి.

## యువ దర్శకుడి తక్షణ కర్తవ్యం..ఒకేసారి ఇద్దరితో!



చేతిలో రెండు క్రేజీ ప్రాజెక్టులు ఉన్నప్పుడు.. అందులోనూ ఆ రెండూ ఏమాత్రం మిస్ చేయకూడని క్రేజీ కాంబినేషన్లు అయినప్పుడు.. ఆ రెండిటినీ కాపాడుకునేందుకు ఎవరైనా దర్శకుడు ఏం చేయాలి? కచ్చితంగా ఒక తెలివైన దర్శకుడు చేయాల్సిన తక్షణ పని ఆ రెండు సినిమాలను పట్టాలెక్కించేందుకు బ్యాక్ టు బ్యాక్ ప్యారలల్ వర్క్ నడిపించడమే. ప్రస్తుతం టాలీవుడ్ యువ డైరెక్టర్ సుజీత్ సరిగ్గా ఇలాంటి స్థితిలోనే ఉన్నాడు. ఒకవైపు పవన్ కళ్యాణ్ –ఓజీ 2–, మరోవైపు నాని –బ్లడీ రోమియో– చిత్రాలను బ్యాలెన్స్ చేయడమే అతని ముందున్న తక్షణ కర్తవ్యం. అయితే ఇక్కడ సినిమా అవకాశం ఇచ్చినది ఒక పెద్ద మాస్ హీరో, పైగా ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం అయిన పవన్ కళ్యాణ్ గనుక సుజీత్ లాంటి యువదర్శకుడు చాలా తర్జన భర్జన పడుతున్నాడట. అప్పటికే ప్రకటించేసిన సినిమాని కచ్చితంగా పూర్తి చేయాలి కాబట్టి....అసలు ఏ ప్రాజెక్ట్ ఎప్పుడు పట్టాలెక్కించాలనే విషయంలో ముందు తన హీరోలను ఒప్పించే పనిలో సుజీత్ ఉన్నాడట. నేచురల్ స్టార్ నానితో ఇంతకుముందు –బ్లడీ రోమియో–' అనే చిత్రాన్ని ప్రకటించగా, ఊహించని విధంగా ఇప్పుడు పవన్ కళ్యాణ్ –ఓజీ– సీక్వెల్ కోసం కాల్షీట్లు కేటాయించడానికి అంగీకరించడంతో వెనువెంటనే సుజీత్ తన ప్రణాళికల్ని మార్చుకోవాల్సి వచ్చింది. శరవేగంగా పవన్ కళ్యాణ్ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు పక్కా బౌండ్ స్క్రిప్టు.. పకడ్బందీ ప్రీప్రొడక్షన్ తో ముందుకు రానున్నారు. దీనికోసం సుజీత్ అండ్ టీమ్ ప్రస్తుతం గట్టి కసరత్తులు చేస్తోందని ఇండస్ట్రీ టాక్. అయితే అప్పటికే నానీతో అఫీషియల్‌గా ప్రకటించేసిన –బ్లడీ రోమియో– సినిమా కూడా ఆగకుండా ప్లాన్ చేయాలని సుజీత్ అంతరంగం చెబుతోందట. ఏ ఒక్క ప్రాజెక్ట్ వెనక్కి వెళ్లినా అది దర్శకుడిగా సుజీత్ కెరీర్‌పై ప్రభావం చూపుతుంది కాబట్టి... నాని సినిమాను కూడా సమాంతరంగా లైన్లో పెట్టాలని ఆయన భావిస్తున్నాడట్. కానీ పవన్ కల్యాణ్‌తో సినిమా అనగానే దానికోసం కేటాయించిన షెడ్యూల్స్ అస్సలు మిస్ కాకూడదు. అటు పొలిటికల్ మీటింగులు, ప్రభుత్వ బాధ్యతలు.. ఇటు సినిమా షెడ్యూళ్లను చాలా తెలివిగా మేనేజ్ చేయాల్సి ఉంటుంది గనుక పవన్ కళ్యాణ్ కోసం ప్రతిదీ సరైన ప్రణాళికతో చేయాల్సి ఉంటుంది. పవన్ సైతం ఎంతో డెడికేటెడ్ గా –ఓజీ 2–కోసం తన వంతు పనిని చేసేందుకు సిద్ధంగా ఉన్న నేపథ్యంలో సుజీత్ ఆ సమయాన్ని ఏమాత్రం వృథా చేయకుండా షూటింగ్ ప్లాన్ చేయాల్సి ఉంది. –ఓజీ– (OG) బాక్సాఫీస్ వద్ద విజయం సాధించడంతో ఇప్పుడు సీక్వెల్ పైనా భారీ అంచనాలు ఉన్నాయి. సీక్వెల్ కోసం స్క్రిప్టు పరంగా రెండు వందల శాతం కష్టపడి మెరుగైన అవుట్‌పుట్‌తో ముందుకు సాగాల్సి ఉంటుంది. ప్రీప్రొడక్షన్ లో అడ్వాన్స్ డ్ ప్రణాళికలు రెడీ చేసుకుంటేనే పవన్ కాల్షీట్లకు అనుగుణంగా పని చేసే వీలుంటుంది. మొత్తానికి –ఓజీ 2– శరవేగంగా పూర్తి చేయగానే... ఏమాత్రం గ్యాప్ తీసుకోకుండా నానీతో –బ్లడీ రోమియో– ప్రాజెక్ట్ కోసం సుజీత్ సిద్ధం కావాల్సి ఉంటుంది.